తిరుమల తిరుపతి దేవస్థానములు

# బాల సప్తగిరి

సచిత్రమాసపత్రిక
జూన్ 2020

సప్తగిరి అనుబంధం



శ్రీస్వామి పుష్కరిణి వద్ద నున్న ఆలయంలో
శ్రీ వరాహస్వామివారు





శ్రీ వాదిరాజస్వామిని
అనుకరిస్తున్న బాలకళాకారుడు

తిరుమల తిరుపతి దేవస్థానములు



# బాలసప్తగిరి

'సప్తగిరి' అనుబంధం


సంపుటి: 01 | జూన్ 2020 | సంచిక: 04


## విషయసూచిక


| | | పుట |
|---|---|---|
| హిందూదేవుళ్లు | శ్రీవరాహస్వామి<br>- డా॥ శ్రీనివాసమూర్తి | 04 |
| పన్నిద్దరాళ్వార్లు | శ్రీతిరుమళిశై ఆళ్వారు<br>- శ్రీ వైద్యం వేంకటేశ్వరాచార్యులు | 06 |
| కన్నడహరిదాసవరేణ్యులు | శ్రీవాదిరాజస్వాములు<br>- శ్రీ సుస్వరం నాగరాజాచార్యులు | 08 |
| చిత్రకథ | శ్రీస్వామి పుష్కరిణీ మాహాత్మ్యం<br>కథ : శ్రీ డి.శ్రీనివాసదీక్షితులు<br>చిత్రాలు: కె.ద్వారకనాథ్ | 10 |
| బాలనీతి | దురదృష్టవంతుడు<br>- డా॥ సముద్రాల లక్ష్మణయ్య | 14 |
| విశిష్టబాలుడు | | 16 |
| క్విజ్ | నిర్వహణ: డా॥ అల్లాడి సంధ్య | 17 |
| చిత్రలేఖనం | | 18 |


ముఖచిత్రం : శ్రీవరాహస్వామివారు, తిరుమల


వెనుక చిత్రం : పెరియాళ్వారు చిత్రం

# శ్రీవరాహస్వామి

- డా॥ శ్రీనివాసమూర్తి

బ్రహ్మదేవుడు ఈ జగత్తును రూపకల్పన చేసి, స్వయంభువ మనువు ప్రజాభివృద్ధి చేయాలని నిర్ణయించుకున్న సమయంలో మహా ప్రళయం సంభవించి భూమండలం మొత్తం కొట్టుకుపోయి సముద్రపు అడుగు భాగాన్ని చేరింది. స్వయంభువమనువు ప్రజాభివృద్ధి చేసేందుకు ప్రాణికోటి జీవించడానికి ఆధారభూతమైన భూమి లేకుండాపోయిందని బ్రహ్మదేవుడు ఎంతో విచారించాడు. ఏం చేయాలో తెలియక ధ్యాన నిమగ్నుడై శ్రీహరిని ప్రార్థించాడు.

శ్రీమహావిష్ణువు కరుణించి "భూమికి ఒక ప్రత్యేకమైన వాసన ఉంటుంది. ప్రస్తుతం భూమి మహాసముద్రంలో మునిగిపోయింది. ఆ వాసనలను అన్వేషిస్తూ భూమి జాడను తెలుసుకోవాలి. అట్టి శక్తి వరాహానికే అధికంగా ఉంది." అన్న వెంటనే ధ్యానంలో మునిగిన బ్రహ్మదేవుని ముక్కు రంధ్రాల నుండి ఒక తెల్లటి వరాహం పుట్టుకు వచ్చింది.




మరీచుడు ఇత్యాది ముని పుంగవులు చూస్తుండ గానే అది ఆకాశానికి ఎగిరిపోయి క్షణంలో

ఏనుగంత ప్రమాణం పెరిగిపోయి చూసేవారికి అద్భుత ఆశ్చర్యాలు కలిగించింది. శంఖచక్రగదాది విష్ణుబలతేజస్సులతో ఉన్న ఆ సుందర వరాహరూపాన్ని చూసి బ్రహ్మాదిదేవతలు మంత్రాలతో స్తుతించారు. అప్పుడు "భూమి సముద్రంలో మునిగిపోవడం చూసి దానిని పైకి తేవడా నికి శ్రీహరి ఈ అవతరం ఎత్తాడని" బ్రహ్మాది దేవతలు కొనియాడారు.

ఇలా ఉండగా జయ, విజయులు శాపకారణంగా దితి, కశ్యపులకు హిరణ్యకశిపుడు, హిరణ్యాక్షుడు కుమారులుగా జన్మించిన వేళ ఉపద్రవాలు సంభవించాయి. పర్వతాలు కంపించాయి. పెరిగి పెద్దవాడైన హిరణ్యాక్షుడు భూదేవిని పీడింపగా, "నీతో తలపడలేను. నువ్వు శ్రీమహావిష్ణువు దగ్గరికి వెళ్లు, ఆయన మాత్రమే నీతో యుద్ధం చేయగల సమఉజ్జీ. వెళ్ళు వెళ్లు" అంది. అప్పుడు హిరణ్యాక్షుడు శ్రీహరిని వెదుకుతూ వచ్చాడు.

ఇంతలో వరాహరూపంలో ఉన్న శ్రీహరి భూమిని తన కక్ష్యలో పెట్టుకొని తీసుకుపోతుంది. అప్పుడు హిరణ్యాక్షుడు ఓహో! విష్ణువు ఈ వరాహరూపంలో ఉన్నాడా? అనుకుని 'ఓ క్రూర మృగమా! ఆ భూమిని వదిలి నాతో యుద్ధం చెయ్యి. ఆ భూమి నాది' అన్నాడు. కాని ఆ వరాహం పట్టించుకోలేదు. 'నీకు శక్తి లేదు. నువ్వు గెలిచిన యుద్ధాలన్నీ యోగమాయ శక్తితో గెలిచావు. కాని, ఇప్పుడు నువ్వు నా నుండి తప్పించు కోలేవు' అన్నాడు హిరణ్యాక్షుడు.

అయినా, ఆ వరాహం తిరిగి చూడలేదు. కాని హిరణ్యాక్షుడు వెంటపడసాగాడు. వాడిని లెక్కచేయకుండా ముందుకు సాగింది వరాహం. ఇరువురు యుద్ధరంగంలో చేరి యుద్ధం ప్రారంభించారు. భీకరయుద్ధం జరిగింది. వానిలో భయంకరశక్తి అవతరించక ముందే వాడిని సంహ రించాలని నిర్ణయించుకున్నాడు. వెంటనే ఇక హిరణ్యాక్షుని ఆగడాలు సహించలేని విష్ణువు ఆ దుర్మార్గుడిని ఏ మాత్రం ఉపేక్షించకుండా వధించి లోకరక్షణ గావించి భూమిని రక్షించాడు.

పన్నిద్దరాళ్వార్లు

# శ్రీతిరుమళిశై ఆళ్వారు

- శ్రీ వైద్యం వేంకటేశ్వరాచార్యులు

"తిరుమళిశై ఆళ్వార్లు' శ్రీహరి సుదర్శనాంశంలో అవతరించారు. వీరు ముదలాళ్వార్లకు సమకాలీనులు. కనకాంగి భార్గవముని వీరి తల్లిదండ్రులు. తిరుమళిశై ఆళ్వారు జన్మించింది మహీసారపురం మహా పుణ్యక్షేత్రం. పసితనంలోనే వరప్రసాదంగా జన్మించిన ఆ బాలునికి ఆకలి దప్పులు లేకుండా శ్రీహరి శ్రీదేవి అనుగ్రహిస్తారు. ఒకనాడు ఆ బాలుడు అరణ్యంలో ఏడుస్తుంటాడు. అప్పుడు తిరువాళరనే మేదరి వాడు ఏడుస్తున్న ఆ బాలుడిని తన భార్యకి ఇస్తాడు. తర్వాత ఆ బాలుడు చిన్నతనం నుండి పాలను స్వీకరించలేదు. అప్పుడు ఒక వృద్ధ దంపతులు అక్కడికి వచ్చి ఆవుపాలు స్వీకరించవలసిందని ఆ బాలుణ్ణి ప్రార్థిస్తారు. వారి ప్రార్థనలు అంగీకరించి ఆ బాలుడు పాలుత్రాగడం మొదలు పెడతాడు. ఆ బాలయోగి దీవెనలవల్ల ఈ వృద్ధ దంపతులు యౌవ్వన వంతులై కణికృష్ణుడు అనే పుత్రుని పొందుతారు. తర్వాతి కాలంలో తిరుమళిశై ఆళ్వారుకు ఇతడే ప్రియశిష్యుడౌతాడు.

తిరుమళిశై ఆళ్వారు బాల్యంలో బుట్టలు అల్లి నగరంలో విక్రయించి తల్లిదండ్రులకు సాయంగా ఉండేవాడు. తర్వాతి కాలంలో ఆ బాలుడు యోగాభ్యాసం చేసేందుకు ప్రారంభిస్తాడు. తత్త్వదర్శనం చేయాలని అన్వేషించి, ముదలాళ్వారుల ద్వారా పంచసంస్కారాలు అందుకుని శ్రీవైష్ణవదీక్షను పొందుతాడు.

వీరు నామ్మగన్‌తిరువన్దాది (96 పాశురాలు), తిరుచ్ఛందవిరుత్తం (120 పాశురాలు) అనే దివ్యప్రబంధాలను అనుగ్రహించారు. భక్తిసార యోగిగా తిరుమళిశైఆళ్వార్లు ప్రసిద్ధి చెందారు. భక్తలోకానికి తన మహిమను తెలిపారన్నదానికి ఉదాహరణగా-ఒకసారి శుక్తిహారుడనే దేవతకు భక్తిసారులు తన 'ఆత్మ' బలవిరచితమైన వజ్రకవచమహిమను చూపిస్తాడు.

మరొకసారి రసవాది అయిన కొంకణిసిద్ధునకు తన చెవిలోని మాలిన్యానికి కొంత మన్ను చేర్చి విలువైన బంగారాన్ని తయారు చేసుకోమని అనుగ్రహించాడు.

మరొకమారు భక్తిసారుల పర్ణశాలకు ఒక ముసలి అవ్వ వచ్చి సేవించేది. ఆమెను అనుగ్రహించి యౌవనవతిగా ఆమెను చేస్తాడు. ఆ దేశరాజు ఆమెను పెండ్లాడుతాడు. కానీ, రాజుకు ముసలితనం వస్తుంది. భార్యకు మాత్రం రాదు. భార్య ద్వారా విషయం తెలిసికొని భిక్షాటనకు వచ్చిన కణికృష్ణుడుతో మీ ఆచార్యులని రప్పించమనగా, అధములను వారు చూడరని చెప్తాడు. తనపై కవిత్వం చెప్పలేదన్న కణికృష్ణుణ్ణి రాజ్యభ్రష్టుని చేస్తాడు.

భక్తిసారులు కణికృష్ణుడు ఇద్దరూ దేశం వదలిపోవుచుండగా ఆ ప్రాంతంలో ఉన్న ఆలయాలలో విగ్రహాలన్నీ మాయమయ్యాయి. భక్తి సారులతో శ్రీభూనీళాది సమేతంగా శ్రీహరి కూడా సమస్త పరివారంతో బయలుదేరడమే ఇందుకు కారణం. అప్పుడు రాజు పరిస్థితి గ్రహించి కణికణ్ణన్, భక్తిసారులతో తనను క్షమించి సత్యవ్రత క్షేత్రాన్ని కాపాడవలసిందిగా ప్రార్థిస్తాడు. భక్తిసారయోగి తిరిగి కాంచీపురానికి వెళ్లగా స్వామివారు తన స్థానంలో శయన భంగిమలో ఉంటారు.



అటుతర్వాత భక్తిసారులు కుంభకోణక్షేత్రానికి ప్రయాణించి అక్కడి శ్రీహరిని సేవించుకుంటాడు. తిరుమళిశై ఆళ్వారు వేంకటాచలంలో వేంకటేశ్వరుని గురించి 'తిరుచ్ఛందవిరుత్తం'లో మంగళాశాసనం గావించారు. శ్రీవేంకటాచలం మీద వెలసిన పరాంధముని గురించి స్తుతించిన తిరుమళిశై ఆళ్వార్లు ధన్యులు. వారి భక్తి ప్రపత్తులు సర్వదా కొనియాడదగినవి.

కన్నడ
హరిదాస
వరేణ్యులు

# శ్రీవాదిరాజస్వాములు

- శ్రీ సుస్వరం నాగరాజాచార్యులు

కర్ణాటక సారస్వత హరిదాసులలో పేరెన్నికగలవారు 'శ్రీవాదిరాజ స్వాములు'. వీరు దక్షిణ కన్నడజిల్లాలో కుంభాసి క్షేత్రము దగ్గర ఉన్న హూలినకీం గ్రామంలో రామాచార్యులు, సరస్వతి పుణ్యదంపతులకు కుమారుడుగా జన్మించారు.


మొదట వీరిని గురువులు 'భూవరాహ' అని పిలిచేవారు. తర్వాతి కాలంలో సన్న్యాసమును స్వీకరించి **'వాదిరాజతీర్థులు'**గా ప్రసిద్ధులయ్యారు. వీరు హయగ్రీవోపాసకులు. హయవదన వీరి అంకితనామము. ఐదు పర్యాయాలు ఉడుపి శ్రీకృష్ణుని పూజించిన ధన్యులు. 'లక్షభరణ'మనే గ్రంథాన్ని వ్రాసి శ్రీనివాసునికి అంకితమిస్తూ, 'సాలగ్రామాల హారము'ను శ్రీనివాసునికి సమర్పించారని ప్రతీతి.

శ్రీమధ్వాచార్యులవారు శ్రీకృష్ణుని పూజానిమిత్తమై ఏర్పరచిన అష్టమఠములలో ఒకటైన స్వాదీమఠాధీశులు శ్రీవాదిరాజులు. వీరి మహిమలు అనేకం. ఒకసారి ఒక కంసాలి పంచలోహగణపతిమూర్తిని చేయదలచి, అచ్చు వేయగా అది హయగ్రీవమూర్తిగా వచ్చినదట. పిమ్మట ఆ కంసాలికి దేవుడు కలలో కన్పించి ఈ మూర్తిని వాదిరాజులు కిమ్మని చెప్పగా, ఆ మూర్తిని అతడు శ్రీవాదిరాజులకిచ్చెనట.

భూవరాహ, నరసింహ ప్రతిమలతో బాటు ఈ హయగ్రీవ మూర్తిని పూజిస్తుంటే పూజాంతంలో అంటే నైవేద్యసమయంలో తెల్లటి గుఱ్ఱము వీరి ముందు వచ్చి నిలబడేది. అప్పుడు వీరు శనగపప్పుతో గట్టి పాయసాన్ని చేయించి ఒక పెద్దపాత్రలో దాన్ని పోసి, తలమీద పెట్టుకుంటే ఆ గుఱ్ఱము తన ముందటి రెండుకాళ్లను వీరి భుజాల మీద పెట్టి

పాయసమంతా తిని వెళ్లేదట. మరొకసారి పండరీపురంలో వీరు హయగ్రీవమూర్తిని పూజిస్తుండగా, అక్కడ సమీపంలో ఒక శెనగలు కాచిన పొలంలో ఒక తెల్లని గుఱ్ఱం మేస్తుండేదట. ఆ యజమాని, 'ఈ గుఱ్ఱము ఈ స్వాములవారి మఠము నుండి రోజు వచ్చి పంట మేస్తోంది. దీని వలన నా పంట నష్టమౌతుందని' వాదిరాజుల వద్ద వాపోగా, రేపు నీ పంట ద్విగుణీకృతంగా ఉంటుందని చెప్పి పంపారు. ఆ మరుసటి రోజు పొలమంతా శెనగలతో ఉంది. వీరు తమ జీవితంలో చూపిన మహిమలు అంతా ఇంతా కాదు. అది ఒక పెద్ద గ్రంథమే అవుతుంది.

వీరు అనేకగ్రంథాలు రచించారు. వీరు రుక్మిణీశ విజయం, తీర్థప్రబంధము, యుక్తిమల్లిక, సరసభారతీవిలాసం అనే గ్రంథాలతో బాటు సంస్కృతంలో దశావతార స్తోత్రాలు, కన్నడంలో దేవరనామము లను రచించారు. వీరు 120 సంవత్సర ములు జీవించినారు. స్వాదీ క్షేత్రమందు బృందావనంలో ఉంటూ, నేటికీ భక్తులను కాపాడుతున్నారు.



'శ్రీశ నీనహోదో శేషా చలవాస నీనహోదో సారిదె నిన్ను వేంకట'వంటి భజన గీతాలు భక్తులు మనస్సులో నిత్యము మననం చేసుకుంటూనే ఉంటారు.

కాబట్టి పిల్లలూ! మీరు నేర్చుకొని పాడి మీ భవిష్యత్తులో ఉత్తమఫలితాలు పొందండి.

చిత్ర కథ

# శ్రీస్వామి పుష్కరిణీ మాహాత్మ్యం


కథ- డి. శ్రీనివాసదీక్షితులు
చిత్రాలు- కె. ద్వారకనాథ్

చంద్రవంశానికి చెందిన రాజు నందుడు.

ఆయన వృద్ధాప్యం రాగానే తన కుమారుడైన ధర్మగుప్తునికి రాజ్యాన్ని అప్పగించి తపస్సు చేసుకోవడానికి రేవానదీతీరానికి వెళ్లాడు.


ఒకరోజు వేటకోసం అడవికి వెళ్ళిన ధర్మగుప్తుడు సింహం దాడి నుండి తప్పించుకుని ఒక చెట్టు మీదకి ఎక్కాడు.


అక్కడే ఉన్న ఎలుగుబంటి మానవభాషలో...






ఎలుగుబంటి బాగా ఆలోచించింది. రాజుతో ధర్మబద్ధంగా ఒక ఒప్పందాన్ని కుదుర్చుకుంది




ఒప్పందం ప్రకారం రాజు ముందు నిద్రపోయాడు. ఎలుగుబంటి అతనిని కంటికి రెప్పలా కాపాడింది. అప్పుడు చెట్టు క్రింద ఉన్న సింహం ఎలుగుబంటితో...
భల్లూకమా! నాకు బాగా ఆకలిగా ఉంది. నిద్రపోతున్న రాజుని క్రిందకి తోసేయ్. తినేస్తాను.
మృగరాజా! నన్ను పూర్తిగా నమ్మిన రాజుకి ద్రోహం చెయ్యటం ధర్మం కాదు. నేను ఆ పని చెయ్యను. ఇక్కడి నుంచి వెళ్లిపో!
4
తర్వాత రాజు మేలుకున్నాడు. ఎలుగుబంటి నిద్రపోయింది... రాజు మీద ఉన్న నమ్మకంతో. అప్పుడు చెట్టు క్రింద ఉన్న సింహం..
రాజా! ఎలుగుబంటిని క్రిందకి తోసేయ్. అది నాకు ఆహారం!
అలాగే మృగరాజా! ఎలుగుబంటిని క్రిందకి తోసేస్తున్నాను!
5
ఏ మాత్రం ఆలోచించకుండా నిద్రపోతున్న ఎలుగు బంటిని క్రిందకి తోసెయ్య బోయాడు రాజు.
కానీ, ఎలుగుబంటి మేలుకుని తెలివిగా క్రిందపడకుండా తనని తాను కాపాడుకుంది. వెంటనే ఎలుగుబంటి రాజుకి దగ్గరగా వచ్చి పట్టరాని కోపంతో..
ఛీ.. కృతఘ్నుడా! నిన్ను కాపాడి నమ్మిన నాకు ద్రోహం చేసావు. ఈ పాపానికి మతిభ్రమించి పిచ్చివాడిగా తిరుగుతావు.
అయ్యో! తప్పు చేశాను. భల్లూకమా!
6


ధర్మగుప్తుడు పిచ్చివాడై దేశాలు పట్టి తిరుగుతున్నాడు. ఆయన కోసం మంత్రులు వెదకగా వెదకగా దొరికాడు. వెంటనే వాళ్లు ఆయనని తండ్రి నందుని దగ్గరికి తీసుకెళ్లారు.
నా కుమారుడు ఎందుకిలా పిచ్చివాడయ్యాడు?
ప్రభూ! మాకు ఆ విషయం అర్థం కాలేదు!
7
అయితే... ఈ పిచ్చి ఎలా పోతుంది? ఏమయినా ఆలోచించారా?
ప్రభూ! జైమిని మహర్షి మాత్రమే ఈ ఆపదలోంచి కాపాడగలడని మా నమ్మకం!
8
వెంటనే అందరూ కలిసి జైమిని మహర్షి ఆశ్రమానికి వెళతారు. నందుడు మహర్షికి నమస్కరించి....
మహర్షీ! నా కుమారునికి పిచ్చి కుదిరే ఉపాయం చెప్పండి!
రాజా! నీ కుమారుడు ఎలుగుబంటిని నమ్మించి ద్రోహం చేశాడు. దాని శాపం వల్లే ఇలా పిచ్చి వాడయ్యాడు.
9


మహర్షీ!
నా కుమారుడు
ధర్మం తప్పాడు.
అవును!
10
దయతో
ఈ పిచ్చిపోయే మార్గం
సెలవియ్యండి మహర్షీ!
రాజా!
నీ కుమారుని
వేంకటాచలానికి తీసుకెళ్లు.
అక్కడ స్వామి
పుష్కరిణిలో
స్నానం చేయించు.
వెంటనే పిచ్చి
కుదురుతుంది!
11
ధర్మగుప్తుని వేంకటాచలానికి తీసుకెళ్లి స్వామిపుష్కరిణిలో స్నానం చేయించాడు నందుడు.
వెంటనే ధర్మగుప్తుడు మామూలు మనిషి అయ్యాడు.
తండ్రీ! నన్ను కాపాడిన ఎలుగుబంటికి ద్రోహం చేశాను.
అందుకు తగిన ఫలాన్ని అనుభవించాను!
చివరికి శుభం జరిగింది.
కుమారా! అంతా
శ్రీవేంకటేశ్వరుని కరుణ...
స్వామిపుష్కరిణి మహిమ!
12
వచ్చే సంచికలో...
శ్రీవేంకటేశ్వరుని మరో దివ్యలీలా విలాసాన్ని
దర్శించి... తరిద్దాం!
స్వస్తి!




# దురదృష్టవంతుడు

- డా॥ సముద్రాల లక్ష్మణయ్య

ఖర్వాటో దివసేశ్వరస్య కిరణై
స్సంతాపితో మస్తకే
వాంఛర్‌దేశ మనాతపం విధివశా
త్తాలస్య మూలం గతః ।
తత్రాప్యస్య మహాఫలేన పతతా
భగ్నం స శబ్దం శిరః
ప్రాయోగచ్ఛతి యత్ర దైవహతక
స్తత్రైవ యాన్త్యాపదః ॥

మనలో అదృష్టవంతులు, దురదృష్ణవంతులు అని రెండు రకాల వారున్నారు. పుణ్యం చేసినవారు అదృష్టవంతులు. పాపాత్ములు దురదృష్టవంతులు. అదృష్టవంతులు ఎక్కడైనా సుఖంగానే జీవిస్తారు. దురదృష్టశాలురు సర్వత్రా దుఃఖానికే గురి అవుతారు.

ఈ సంగతి క్రింది వృత్తాంతం ద్వారా గ్రహించవచ్చు. ఒకడు ఒక గ్రామంనుండి బయలుదేరి మరొక ఊరికి పోతున్నాడు. బస్సులు, రైళ్లు అందుబాటులో లేని మార్గమది. పైగా అది మండు టెండల కాలం. అతడు బట్టతలవాడు. అతని చేతిలో గొడుగు కూడా లేదు.

ఎండ తీవ్రమయింది. అతని బట్టతల కాలిపోసాగింది. చెట్టు నీడకై అతడు అన్వేషించాడు. చివరికి అతనికి అల్లంత దూరంలో ఒక తాటిచెట్టు కనిపించింది. దాని నీడలో విశ్రాంతి

తీసుకొని ఎండ తగ్గిన తర్వాత ప్రయాణం కొనసాగిద్దామని అతడు భావించాడు. త్వరత్వరగా నడచి ఆ చెట్టు క్రిందికి చేరుకొన్నాడు.

ఆ చెట్టుపైన తాటికాయలున్నాయి. అందులో కొన్ని పండిన దశకు చేరుకొన్నాయి. ఇంతలో గాలి విసురుగా వీచింది. ఆ గాలి తాకిడికి ఒక పెద్దతాటి పండు క్రిందికి జారి అతని తలపై పడింది. దానితో తల 'ఠప్' అంటూ బ్రద్దలయింది.



దురదృష్టవంతుడు ఎక్కడికి పోయినా ఆపదలు అతణ్ణి వెన్నంటి పోతాయి.

'దరిద్రుడు తలగడగపోతే వడగండ్ల వాన కురిసింది' మున్నగు సామెతలు ఇలాంటి దైవోపహతులను గురించే పుట్టుకొచ్చాయి.

# విశిష్టబాలుడు



**పేరు** - యు.భరత్ శర్మ
**తరగతి** - 9వ తరగతి
**పుట్టిన తేది** - 17-05-2006
**తండ్రిపేరు** - ఉప్పలధడియం రాజీవలోచన శర్మ
**తల్లిపేరు** - శ్రీమతి శైలజ
**పాఠశాల** - భారతీయ విద్యాభవన్ శ్రీవేంకటేశ్వర విద్యాలయ, తిరుపతి కేంద్రం.
**విశేషప్రతిభ- వివిధరంగాలు-** మృదంగవిన్యాసం, గాత్రసంగీతం, తెలుగు సాహిత్యం, శతకరచన, శ్లోకాలపఠనం, ఏకపాత్రాభినయం, చిత్రలేఖనం, చదరంగం, అబాకస్, విద్యారంగం, నాయకత్వలక్షణాల్లో ప్రతిభ.
**లక్ష్యం-** తెలుగు సాహిత్య పరిశోధన తెలుగు భాషను అభివృద్ధి చేయడం.

## ----: సాధించిన విజయాలు :----

**2009-** ఎల్.కె.జి. నుండే భగవద్గీతలో బహుమతులు.

**2011-** ఒకటవ తరగతిలో మార్గ్ చిన్మయ విద్యాలయం వారు నిర్వహించిన గోవింద నామాలు పోటీలో మొదటి బహుమతి.

**2013-** భారతీయ విద్యాభవన్ వారు నిర్వహించిన పుస్తక ప్రదర్శనలో రెండవ తరగతి లోనే బమ్మెర పోతనగా ఏకపాత్రాభినయం చేసి బహుమతి పొందాడు.

**2014-** చిన్మయ మిషన్ వారిచే నిర్వహించబడ్డ జిల్లాస్థాయి భగవద్గీత పోటీల్లో మూడవబహుమతి పొందాడు.

రాష్ట్రియ సంస్కృత విశ్వవిద్యాలయంవారు నిర్వహించిన భగవద్గీత పోటీలలో మొదటి బహుమతి కైవసం చేసుకున్నాడు.

**2015-** ఎస్.ఐ.పి. అబాకస్ వారు విజయవాడలో నిర్వహించిన "ఎస్.ఐ.పి. రీజినల్ ప్రాడిజీ" పోటీలో బహుమతి పొందాడు.

**2017-** సత్యసాయి బాలవికాస్ వారు నిర్వహించిన జిల్లాస్థాయి "ఏకపాత్రాభి నయం మరియు సంగీత" పోటీల్లో మొదటి బహుమతి పొందాడు.

**2018-** రామకృష్ణమిషన్‌లో స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని "వినాయక రజత" ప్రతిమ బహుమతి,

తిరుపతి ఫిలిమ్ సొసైటీ వారు నిర్వహించిన 'ఏకపాత్రాభినయం' పోటీలో దుర్యోధనుని పాత్ర వహించి మొదటి బహుమతి,

తిరుపతి సైన్స్‌సెంటర్ వారు నిర్వహించిన "కళాఉత్సవం" జిల్లాస్థాయి పోటీల్లో తన మృదంగంలో ప్రతిభ చాటుకుని మొదటి బహుమతులను పొందాడు.

**2020-** సంస్కారభారతివారు ఆన్‌లైన్ ద్వారా నిర్వహించిన రాష్ట్రస్థాయి పద్యాల పోటీలు మొదటి బహుమతి పొందాడు.

# క్విజ్

**నిర్వహణ-**
**డా॥ అల్లాడి సంధ్య**

**1) పాండవులు ఎన్ని సంవత్సరాలు వనవాసం చేశారు?**

అ) పది ఆ) పన్నెండు
ఇ) పద్నాలుగు ఈ) పదహారు

**2) 'ఉడయవర్లు' అని ఎవరికి పేరు?**

అ) పెరియాళ్వార్ ఆ) శ్రీరామానుజులు
ఇ) నమ్మాళ్వార్ ఈ) కులశేఖరాళ్వార్

**3) 'శ్రీమద్రామాయణం'లో కాండలు ఎన్ని?**

అ) ఎనిమిది ఆ) తొమ్మిది
ఇ) ఏడు ఈ) ఆరు

**4) అరుంధతి భర్త ఎవరు?**

అ) విశ్వామిత్రుడు ఆ) వసిష్ఠుడు
ఇ) కశ్యపుడు ఈ) భరద్వాజుడు

**5) దశావతారాలలో మొదటి అవతారం ఏది?**

అ) కూర్మ ఆ) వరాహ
ఇ) నరసింహ ఈ) మత్స్య

**6) 'భక్తరామదాసు' అసలు పేరు?**

అ) మాదన్న ఆ) అక్కన్న
ఇ) గోపన్న ఈ) తిక్కన

**7) 'అన్నమయ్య' స్వామివారి ఏ అంశతో జన్మించారు?**

అ) ఖడ్గం (నందకం) ఆ) గద (కౌమోదకి)
ఇ) చక్రం (సుదర్శనం) ఈ) శంఖం (పాంచజన్యం)


---

**జవాబులు**

1) ఆ 2) ఆ 3) ఇ 4) ఆ 5) ఈ 6) ఇ 7) ఆ

# చిత్ర లేఖనం

**ఈ బొమ్మకు రంగులు వేద్దామా...**



**పై బొమ్మను క్రింది గళ్ళలో గీయండి...**



బ్రహ్మోత్సవాలలో బాలబాలికలు

SAPTHAGIRI (TELUGU) ILLUSTRATED MONTHLY Published by Tirumala Tirupati Devasthanams
printing on 30-06-2020. Regd. with the Registrar of Newspapers under
"RNI" No.10742, Postal Regd.No.TRP/10 - 2018-2020
Licensed to post without prepayment No.PMGK/RNP/WPP-04/2018-2020

